
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ మాసపత్రిక

APRIL - 2008

సంవత్సర చందా రూ. 50/-

# Declaration *(See Rule 3)*

| | | |
|---|---|---|
| Titlle of the News paper | : | Satya vakku |
| Language | : | Telugu |
| Name & Address of the Publisher | : | Joshua Gootam |
| Nationality | : | Indian |
| Name of the Printer with address | : | Joshua Gootam<br>10-4-33/1,<br>Seshagiri Rao Street,<br>Kakinada - 533 004. |
| Place of printing with address | : | Satya Vani<br>Church of Christ,<br>7-9-35,<br>Sambamurthy Street,<br>Kakinada - 533 001. |
| Place of Publishing | : | Satya Vani<br>7-9-35,<br>Sambamurthy Street,<br>Kakinada - 533 001. |
| Name of the Editor | : | Joshua Gootam (Indian)<br>10-4-33/1,<br>Seshagiri Rao Street,<br>Kakinada - 533 004. |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper above are true to the best of my knowledge and belief.

Sd-

Joshua Gootam

# సత్యవాక్యం
# THE WORD OF TRUTH
P.O.Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | ఏప్రిల్ 2008 | సంచిక 9

## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 1
## (Jesus Christ, the son of God)

యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెననుటకు రుజువేమిటి యని అడిగితే, ఈరోజేయని ఒక్కమాటలో జవాబిచ్చేయ వచ్చును. యేసుక్రీస్తు పౌరాణిక వ్యక్తి కాదు. ఆయన చారిత్రాత్మక పురుషుడు. మానవజాతి చరిత్రకు ఆయన కేంద్రబిందువై యున్నారు గనుక చరిత్ర అంతయును క్రీస్తుపూర్వము అని గాని, క్రీస్తుశకము అనిగాని లెక్కింపబడుచున్నది. ఇప్పుడు మనము 2008వ సంవత్సరములో యున్నాము. ఈ వ్యాసమును ముద్రించుసరికి క్రీస్తు ఈ లోకమునకు వచ్చి 2008 సంవత్సరముల 4 మాసముల 15 రోజులైనది.

విచిత్రమేమంటే ఈ లోకంలో జీవిస్తుయున్న ప్రతివ్యక్తి తాను చేయు ప్రతిపనికి క్రీస్తునే తెలియకుండా సాక్షిగా పిలుచుచున్నాడు. మనం ఎవరికి ఉత్తరం వ్రాసినా, డబ్బు అప్పు యిచ్చినా, పుచ్చుకున్నా, ఆస్థిని అమ్మినా, కొనినా,

ఏదైనా ఒప్పందములు లిఖితపూర్వకముగా చేసికొన్నా, మొదట ఆ కాగితాలపై తేదీవేస్తాము. అయితే ఆ తేదీ ఎవరిదీ? ఆ తేదీ క్రీస్తుదే. అంటే యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చిన 2008వ సం॥లో, 4వ మాసములో 4వ తేదీలో నీకు డబ్బు అప్పుయిచ్చాననో, లేక ఫలాన ఆస్తిని కొన్నాననో మనం క్రీస్తునే ము[illegible]గ సాక్షిగా పిలుచుచున్నాము. నిజానికి మీరు క్రైస్తవులయినా, క్రైస్తవులుకాక పోయినా, దేవుని యందు విశ్వాసులైనా, కాకపోయినా క్రీస్తు లేకుండా మీ దైనందిన జీవితం గడవదు. అంతాఎందుకు? ప్రతి వ్యాపారి తాను ఎక్కడైతే తేదీ వేస్తున్నాడో తనకు తెలియకుండానే క్రీస్తును సాక్షిగా పెట్టుకొనుచున్నాడు. వార్తపత్రికల వారిని చూడండి. ఆ పత్రికలపై వారు మొట్టమొదట తేదీనే ముద్రిస్తారు. మనం కూడ ఆ పత్రిక ఏ రోజుదో చూచి మరీ చదువుతాము. విశ్వవ్యాప్తంగా ప్రచురితమయ్యే ప్రతి వార్తపత్రికల వారు ముందుగా యేసు క్రీస్తునే సాక్షిగా పిలుస్తారు, పెట్టుకొంటారు.

## చరిత్ర గలవాడు

మానజాతి చరిత్ర అంతా క్రీస్తును బట్టియే పరిగణించ బడుచున్నది గనుక ఆయన అసామాన్యమైన వ్యక్తి అని మనం గ్రహించుకోగలం. మరియు పురాణాల్లో యున్న వ్యక్తులవలె గాక ఆయన రాకపోకలను గూర్చిన నిర్దిష్టమైన చరిత్ర యున్నది. ఆయన ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో, ఎంతకాలం జీవించారో, యేమేమి చేసారో, ఎట్లు చనిపోయారో, అటు తరువాత యేమి జరిగిందో.... ఈ వివరాలన్నీ చరిత్రపుటలలో యున్నాయి. వాటిని మనం ఈనాడు కూడా పరిశోధించి ఆయనను గూర్చిన వాస్తవాలను తెలిసికోవచ్చును. గనుక యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెననుటలో సందేహము లేనేలేదు. ఇప్పుడు మనం క్రీస్తుశకంలో జీవించుచున్నాము!! అయితే ఆయన ఈ లోకమునకు వచ్చినప్పుడు ఎందుకు వచ్చెను? అనే ప్రశ్న మనకు ఉద్భవింపవచ్చును. దానికి జవాబుగా అపో.పౌలు యిట్లు చెప్పుచున్నాడు: "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను"

(1 తిమోతి 1:15). మరల "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతివరుడని తీర్పుపొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింవబడెను, లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" అని అతడు 1 తిమోతి 3:16లో వ్రాసెను.

## సశరీరుడు

యేసుప్రభువు ఈలోకంలో సశరీరుడుగా ప్రత్యక్షమాయెను. ఆయన బేత్లెహేము నగరంలో కన్యయైన మరియ గర్భమున మానవునిగ ఉద్భవింపక ముందు నుండే ఉనికి కలిగియుండెను. ఆయన ఆదినుండి "దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించు కొనెను" (ఫిలిప్పీ 2:5-8).

యేసుప్రభువు ఈలోకంలో ఉద్భవింపక ముందు వాక్యమైన దేవుడై యుండెను. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను, సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్న దేదియు ఆయన లేకుండా కలుగలేదు", "ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:1-3;14).

యేసుప్రభువు ఈలోకంలో యుండగా తాను దేవుడనని, దేవుని కుమారుడనని నిరూపించుకొనెను. సరిగదా మానవులు ఆయనను అట్లు విశ్వసించాలని కోరుకొనెను. మరియు,

"నేను ఆయననని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనేయుండి మరణింతురని" హెచ్చరించెను (యోహాను 8:24). యేసుప్రభు తాను జన్మించిన రీతిని బట్టి, తండ్రియైన దేవుడిచ్చిన సాక్ష్యమును బట్టి, చేసిన అద్భుతములు, మహత్కార్యములను బట్టి, దేవుని కుమారుడని నిరూపించుకొనెను.

## క్రీస్తు జనన విధానము

"యేసుక్రీస్తు జననవిధ మెట్లనగా తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడై యుండి ఆమెను అవమాన పరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను. అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించు కొనుచుండగా, ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై యొక కుమారుని కనును, ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకుతోడని అర్థము. యోసేపు నిద్ర మేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అని పేరు పెట్టెను" (మత్తయి 1:18-25).

యేసు జన్మించిన సమయమందు, "ఆ దేశములో కొందరు గొర్రెల కాపరులు పొలములో ఉండి రాత్రివేళ తమమందను కాచుకొను చుండగా ప్రభుదూత వారియొద్దకు వచ్చి నిలిచెను; ప్రభువు మహిమ వారిచుట్టు ప్రకాశించినందున వారు మిక్కిలి భయపడిరి. అయితే ఆ దూత భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని

కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు దానికిదే మీకానవాలు, ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొకతొట్టిలో పండుకొని యుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను. వెంటనే పరలోక సైన్యసమూహము ఆ దూతతో కూడ నుండి సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయనకిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగును గాక అని దేవునికి స్తోత్రము చేయుచుండెను.

"ఆ దూతలు తమయొద్ద నుండి పరలోకమునకు వెళ్లిన తరువాత ఆ గొర్రెలకాపరులు-జరిగిన యీ కార్యమును ప్రభువు మనకు తెలియజేయించి యున్నాడు; మనము బేత్లెహేము వరకు వెళ్లి చూతము రండని యొకనితోనొకడు చెప్పుకొని త్వరగా వెళ్లి మరియను, యోసేపును తొట్టిలో పండుకొని యున్న శిశువును చూచిరి. వారుచూచి , యీ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు ప్రచారము చేసిరి. గొర్రెలకాపరులు తమతో చెప్పిన సంగతులను గూర్చి విన్నవారందరు మిక్కిలి ఆశ్చర్యపడిరి. అయితే మరియ ఆ మాటలన్నియు తన హృదయములో తలపోసికొనుచు భద్రము చేసికొనెను. అంతట ఆ గొర్రెల కాపరులు తమతో చెప్పబడినట్టుగా తాము విన్నవాటిని కన్నవాటినన్నిటిని గూర్చి దేవుని మహిమపరచుచు స్తోత్రము చేయుచు తిరిగివెళ్లిరి" (లూకా 2:8-20).

ఈరీతిగ యేసుప్రభువు అద్భుతంగా కన్యయైన మరియ గర్భమున పుట్టెను. మరియ నజరేతు అను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపు అను ఒక పురుషునికి ప్రధానము చేయబడెను. ఆమె కన్యక. అయితే దేవునిచే పంపబడిన "ఒక దూత లోపలికి వచ్చి, ఆమెను చూచి-దయా ప్రాప్తురాలా నీవు శుభము; ప్రభువు నీకుతోడై యున్నాడని చెప్పెను. ఆమె ఈమాటకు తొందరపడి ఈ శుభవచన మేమిటో అని ఆలోచించుకొను చుండగా, దూత-మరియా భయపడకుము, దేవుని వలన నీవు కృపపొందితివి. ఇదిగో నీవు

గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగ యుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను. అందుకు మరియ-నేను పురుషుని ఎరుగని దాననే యిదేలాగు జరుగునని దూతతో అనగా-దూత పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును ...... .......దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను. అందుకు మరియ-ఇదిగో ప్రభువు దాసురాలను: నీ మాట చొప్పున నాకు జరుగును గాక అనెను. అంతట దూత ఆమె యొద్దనుండి వెళ్లెను" (లూకా 1:24-38).

ఈరీతిగా ఒక పురుషునితో సంపర్కము లేకుండ కన్యయైన మరియ పరిశుద్ధాత్మ దేవుని వలన గర్భము ధరించి కుమారుని కనెను. ఆయనే యేసుక్రీస్తు. యేసు అనగా రక్షకుడని, క్రీస్తు అనగా అభిషిక్తుడని అర్ధము. ఆయన దేవుని కుమారుడు. స్త్రీ గర్భమున ఉద్భవించెను గనకుక మనుష్య కుమారుడు కూడాను. మనలను రక్షించు నిమిత్తము ఈరీతిగా మానవాతారియై ఆయన ఈలోకమునకు వచ్చెను. ఆయనకు ముందుగాని, అటు తరువాతగాని ఒక కన్యక గర్భవతియైన సందర్భమును ప్రపంచములో ఎక్కడా కనుగొనలేము. ఆయన జన్మించిన విధానము ఆశ్చర్యము, అసామాన్యము, ఏలయనగా ఆయన దేవుని కుమారుడు!

---

**సత్యవాణి** TV కార్యక్రమములను ప్రతిసోమవారం నుండి శుక్రవారం వరకు శుభవార్త ఛానల్‌లో ఉదయం 6:00 గంటలకు, రాత్రి 10:30 గంటలకు చూడండి. T.V - 5 లో ప్రతిశనివారం ఉదయం 6:30 గంటలకు చూడండి. సత్యసువార్తను వినండి! విన్పించండి !!

# సంఘమునకు తిరిగి చేరుకొనుట
## (Return to the Church)

సంఘమందున్న ప్రతి సభ్యుడు ప్రభువునకు నమ్మకముగా యుండవలెనని ఆయన కోరుచున్నారు. అతనిని ప్రోత్సహించు నిమిత్తము క్రొత్తనిబంధనలో ఎక్కువ భాగము వ్రాయబడి యున్నది. అయితే విచారకరమైన సంగతి యేమంటే, ప్రభువునకు అందరు నమ్మకముగా యుండుట లేదు. అందరివలెనే సంఘ సభ్యులుకూడ మానవులే. మరియు శరీరము బలహీనమైనది. రక్షింపబడని వానికంటే క్రైస్తవునికి అతని శోధనలలో ప్రభువు సహాయపడుట, యితర క్రైస్తవులు సాంగత్యముండుట, దేవుని పనిలో నిమగ్నుడై యుండుట అను గొప్ప తరుణములున్నను, అతడు విశ్వాసమునుండి పడిపోవుట సాధ్యమే. వారు పడిపోనవసరము లేకుండ అనేక కారణములు కలవు గాని వారు పడిపోవుట జరుగును.

### తొలగిపోవుట సాధ్యమే

విశ్వాసమునుండి తొలగిపోవుట సాధ్యమేయని బోధించు కొన్ని వచనమునలు మనము ఇప్పుడు చూచుకొనుట మంచిది. యేసు చెప్పిన అనేక ఉపమానములు ఈ సత్యమును ప్రాముఖ్యముగ చూపించుచున్నవి. విత్తువాని ఉపమానములో సత్యము నంగీకరించిన తరువాత శోధనలు, హింసలు రాగా పడిపోయిన వానిని గూర్చి యేసుబోధించెను. మరియు సత్యమునకు విధేయుడైన తరువాత ఐహిక విచారము వలనను, ధన వెూనమువలనను దానినుండి తొలగిపోయిన వానిని గూర్చి ఆయన బోధించెను (మత్తయి 8:18-23). ప్రభువు తిరిగి వచ్చుసరికి క్రైస్తవులు కూడ ఎట్లు సిద్ధపడి యుండరో పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము బోధించున్నది (మత్తయి 25:1-13). తలాంతులను గూర్చి నట్టియు, తప్పిపోయిన కుమారుని గూర్చి నట్టియు ఉన్న ఉపమానములు ఈ సత్యమును బోధించుచున్నవి (మత్తయి 25:14:30; లూకా 15:11-32). మిగిలిన రిఫరెన్సుల కొరకు ఈ వచనములను చదవండి: అపో.కా 5: 1-11; 8:9-24; 2 పేతురు 2:20-22; మత్త 13:41-42. విశ్వాసమునుండి తొలగిపోవుటనుగూర్చి హెచ్చరించుచు ప్రభువునకు నమ్మకముగా జీవించుట అత్యవుసరమని

లేఖనములు బోధించుచున్నందున, ఒకడు ఆ హెచ్చరికలను గైకొనక నమ్మకముగా జీవించని యెడల విశ్వాసము నుండి పడిపోవుట సాధ్యమే యని గ్రహింపగుచున్నది. పాపములో పడిపోయిన వారికి ఏమి జరుగును? వారట్లు పాపములోనికి జారిపోయి నందున వారు నశించిపోవుదురని దీని యర్థమా? నిజమే, అట్టిది జరుగుట సాధ్యమే. అయితే అట్టి వ్యక్తికి కూడ శుభవర్తమానము ఒకటి యున్నది. ఏలయనగా అతిక్రమములో యున్న క్రైస్తవుని క్షమిచుటకు దేవుని యాజ్ఞ, ఒకటి యున్నది (గలతీ 6:1; యాకోబు 5:19-20; మత్తయి 18:21,22,35).

తప్పు చేసిన క్రైస్తవుడు తన పాపములను గూర్చి మారుమనుస్సు పొంది, తన తప్పిదములను ఒప్పుకొని తన పాపములు క్షమించబడునట్లు దేవుని ప్రార్థించవలెనని బైబిలు బోధించుచున్నది. ఒకడు దేవుని యెదుట తన హృదయములో పాపము చేసిన యెడల అతడా పాపమును గూర్చి మారుమస్సు పొంది, దానిని దేవుని యెదుట ఒప్పుకొని, క్షమాపణను అడుగవలెను (మత్తయి 6:13). ఒకడు తన బంధువు లేక మిత్రుడు లేక పొరుగు వాని యెడల పాపము చేసిన యెడల అతడు వానియొద్దకు వెళ్ళి తన తప్పిదమును ఒప్పుకొని క్షమాపణ కొరకు దేవుని నడుగవలెనను (మత్త 5:23-24). అయితే ఒకని పాపము బహిరంగముగయుండి దేవుని సంఘమునకు, దేవుని నామమునకు సిగ్గు తెచ్చునట్టిదియైన యెడల అతడు తన పాపము విషయమై మారుమనస్సు పొంది, సంఘము యెదుట తన తప్పిదమును ఒప్పుకొని పాపక్షమాపణ కొరకు దేవుని ప్రార్థింపవలెను. ఆ వ్యక్తి నిజముగా దేవుని యొద్దకు తిరిగి చేరుకొనవలెనని వెదకుచున్న యెడల ప్రభువు అతని నంగీకరించుటయే గాక సంఘము అతనిదోషములను క్షమించి ప్రభువునకు పునరుద్ధరింవబడిన వానివలె అతని నంగీకరించును (మత్తయి 6:14-15).

### తిరిగి చేర్చబడు విధానము

సంఘముతో తిరిగి చేర్చబడుటకు ఒకడు చేయవలసిన పనులను ఇప్పుడు కొంతజాగ్రత్తగా చూచుకొందము. పాపము చేసి ప్రభువు నొద్దకు తిరిగి చేరవలెనని ఆశించుచున్న క్రైస్తవునికే ఈ షరతులు వర్తించునని దయచేసి గుర్తుంచుకొనుము. ఆ షరతులు యివి:

1. ఒకడు తన పాపములవిషయమై మారుమనస్సు నొందవలెను. క్రైస్తవుడొకడు బుద్ధిపూర్వకముగనో, బుద్ధి

పూర్వకముగా గాకనో సంఘమునుండి దూరమైపోయిన యెడల లేక తన బాధ్యతను తాను నిర్వర్తించని యెడల లేక భక్తి హీనునివలె జీవించుచున్న యెడల అట్టివాడు ప్రభువు నొద్దకు మరల చేరుకొనుటకు తన పాపముల విషయమై మొదటిగా మారుమనస్సు పొందవలెను. అతడు మార్పునొంది సరియైన మార్గమున నడచుకొనవలెను. ప్రభువునకు లోబడి అటు తరువాత దేవుని వరమును ధనముతో సంపాదించ వలెననుకొని పాపము చేసిన సీమోనుతో పేతురు యిట్లనెను: "కాబట్టి యీ నీ చెడు తనమును మానుకొని మారుమనస్సు నొంది ప్రభువును వేడుకొనుము, ఒక వేళ నీ హృదయాలోచన క్షమింపబడ వచ్చును'' (అపొ.కా. 8:22). తప్పిపోయిన కుమారుడు తన పాపపు జీవితమును విడనాడి తండ్రి యొద్దకు తిరిగి వచ్చి అతడు మారుమనస్సు పొందినట్లు నిరూపించెను. ఒకడు పాపములోనే యుంటూ అతని ప్రభువు, సంఘము అంగీకరించవలెని కోరుట సరికాదు.

2. ఒకడు తన దోషములను ఒప్పుకొనవలెను, "మీ పాపములను ఒకని తో నొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహుబలముగలదై యుండును" అని యాకోబు వ్రాసెను (యాకోబు 5:16). ఒకడు తన పాపములన్నియు పూసగుచ్చి నట్లు వరుసగ విపులముగ వర్ణించివలెనని దీని భావము కాదుగాని అతడు తన్ను తాను తగ్గించుకొని తన సహోదరుల యెదుట తన దోషములను ఒప్పుకొనవలెను. తప్పిపోయిన కుమారుడు ఇట్లు ఒప్పుకొనెను: "తండ్రీ! నేను పరలోకమునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని: ఇక మీదట నీ కుమారుడని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను" (లూకా15:18,19). ఒకడు గర్వముతో నిండినవాడై తన పాపమును ఒప్పుకొనుటకు నిరాకరించుచున్న యెడల అతడు పునరుద్ధరించబడుటకు సంసిద్ధుడుగా లేడు. అతడు షరతులపై తిరిగి చేరుటకు ఆశించలేదు గాని అతడు ప్రభువు చిత్తముకు లోబడవలెను. అట్లయినప్పుడు అతడు తన పాపములను ఒప్పుకొనవలెను. సీమోను తన పావము స్థితిని గూర్చి చెప్పబడినప్పుడు "మీరు చెప్పిన వాటిలో ఏదియు నా మీదికి రాకుండా మీరే నా కొరకు ప్రభువును వేడుకొనుడని చెప్పెను" (అపొ.కా. 8:24). గనుక సీమోను తన పాపము నంగీకరించి

దానిని సరిజేసు కొనగోరెను.

3. క్షమాపణ కొరకు ఒకడు దేవుని ప్రార్థించవలెను. ఒకడు తన పాపములను ఒప్పుకొనుట మాత్రమేగాక, క్షమాపణ నిమిత్తము దేవుని ప్రార్థించవలెనని యాకోబు 5:16లో చెప్పబడియున్నది. తన తప్పిదములను ఒప్పుకొనుచు తప్పిపోయిన కుమారుడు తండ్రి యొద్దకు వచ్చెను. తండ్రి కృపతో అతనిని తిరిగి చేర్చుకొనెను (లూకా 15:21-25).

ఒక వ్యక్తి తన కుటుంబములోనికి జన్మించగా అతడు ఎల్లప్పుడు ఆ కుటుంబ సభ్యునిగా యుండును. దేవుని కుటుంబ విషయములో కూడ అది సత్యమే. అదే ఆయన సంఘము. అయితే తండ్రి యొద్దనుండి కలుగు వారసత్వమును పోగొట్టు కొనలేము అని దీని అర్థముకాదు. ఒకడు పరలోపు వారసత్వమును పోగొట్టుకొనిన యెడల నిత్యనాశనమునకు పోవును. అది బహు భయంకరమైనది. అయితే ఒకడు దేవునినుండియు, సంఘమునుండియు తొలగిపోయినను, ఇదివరకటి స్థానముకు తిరిగి చేరుకొనుటకు ఒక మార్గము కలదని తెలిసికొనుట ధన్యకరమైనది.

ఒకడు క్షమింపబడునట్లు ప్రభువు యొక్క షరతులకు లోబడిన యెడల అతనిని పరలోక తండ్రియు, సంఘమును వారియొక్క ప్రేమలోనికి, సహవాసములోని తిరిగి చేర్చుకొన గలరు. బైబిలు దీనిని బోధించుచున్నది గనకు దీనిని సంఘము బోధించుచు అనుసరించుచున్నది.

- జి.సి. ఛోట్

**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీ యింటిలోనే పూర్తిచేసి బైబిలు జ్ఞానమును పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80, KAKINADA - 533 001.

గమనిక : సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపిచవలయును.

# దేవుని ఏడు ఉగ్రత పాత్రలు
## (The Seven Bowls of wrath)

**పరిచయం:**

ప్రకటన 16వ అధ్యాయమును చదువుము. ఈ అధ్యాయం దేవుని ఏడు ఉగ్రత పాత్రలను గూర్చి చెప్పును.

ప్రకటన 16వ అధ్యాయము యొక్క వర్తమానము సంగ్రహముగా రోమా 2:5లో చెప్పబడినది. అది "నీ కాఠిన్యమును మార్పుపొందని నీ హృదయమును అనుసరించి ఉగ్రత దినమందు అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలు పరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు".

ప్రకటన 16వ అధ్యాయమును గ్రహించుటకుగాను ఆగ్రంథము యొక్క సందర్భాన్ని అంతటినీ మనసులో ఉంచుకోవాలి.

14-16 అధ్యాయాల్లో క్రూరమృగము యొక్క ముద్రను ధరించు కొన్నవారు దేవుని ఉగ్రతను ఎదుర్కొనుట చూస్తాము. మిగతా అధ్యాయాల్లో దేవుని మిగతా శత్రువులు నాశనం చేయబడి అంతిమ విజయం చేకూర్చబడుట గమనిస్తాము.

**ఏడు బూరలు, ఏడు ఉగ్రత పాత్రలు:**

ప్రకటన 8 నుండి 11 వరకు ఉన్న అధ్యాయాల్లో చెప్పబడిన ఏడు హెచ్చరిక బూరల ( Trúmpets of warning) ద్వారా ఈ ఏడు ఉగ్రత పాత్రలను గ్రహించుకోవచ్చును.

ఆ ఏడు హెచ్చరిక బూరలు ఇక్కడున్న ఏడు ఉగ్రత పాత్రలు ఒకే దానిని గూర్చి చెప్పుచున్నవి. ప్రతి అంశములో ఈ రెండు సంధర్భములు ఒకే రీతిగ యున్నవి. గనుక ఒకే సంఘటనను అవి సూచించుచున్నవి. గమనించుము.

☞ ప్రకట 8:7లో మొదటి బూర ఊదబడగా **భూమి** బాధింపబడెను. ప్రక 16:2లో మొదటి ఉగ్రత పాత్ర కుమ్మరింపబడగా **భూమిపై** నున్నవారే బాధింపబడిరి.

☞ మొదటి బూర మొదటి ఉగ్రతపాత్ర యొక్క లక్ష్యము **భూమియే.**

☞ ప్రక 8:8లో చెప్పబడిన రెండవ బూర. 16:3లో చెప్పబడిన ఉగ్రతపాత్ర వలన

**సముద్రము** బాధింపబడెను.

ప్రక 8:10లో చెప్పబడిన మూడవ బూర 16:4లో చెప్పబడిన మూడవ పాత్ర వలన **నదులు, జలధారలు** అందున్న జీవులు బాధింపబడెను చచ్చెను.

ప్రక 8:12లో చెప్పబడిన నాల్గవ బూర 16:8లో చెప్పబడిన ఉగ్రత పాత్రలు **సూర్యుని** గూర్చి చెప్పుచున్నవి.

ప్రక 9:1-11లో చెప్పబడిన 5వ బూర 16:10-11లో చెప్పబడిన ఉగ్రత పాత్రవలన **అగాధ రాజ్యము, క్రూరమృగము యొక్క** సింహాసనమును గూర్చి చెప్పబడెను.

ప్రక 9:14లో చెప్పబడిన ఆరవ బూర 16:12లో చెప్పబడిన ఆరవ ఉగ్రత పాత్ర యూఫ్రటీసు నదిని గూర్చి చెప్పబడెను.

ప్రక 11:15-19లో యున్న ఏడవ బూర 16:17-21లో చెప్పబడిన ఏడవ ఉగ్రత పాత్ర వలన **వాయు మండలములో మెరుపులు, ధ్వనులు ఉరుములు** పుట్టెను. మహా భూకంపము కలిగెను.

ఈ బూరలు, ఉగ్రత పాత్రలు సరిమానమైన ఒకే సంగతులను సూచించు చున్నవి. 8-11 వరకునున్న అధ్యాయాల్లో మనం **దుర్మార్గులపై** దేవుని తీర్పులను గుర్తిస్తాము. హింసింపబడుచున్న దేవుని ప్రజల ఆర్త నాదముల ప్రతిఫలం అది. దేవుని తీర్పులు ఇంత ఖచ్చితంగా యున్నా వారు మారుమనస్సు పొందలేదు, మారుమనస్సు పొందలేదు!

**మొదటి ఉగ్రత పాత్ర** : 16:12

మొదటి దేవుని ఉగ్రత పాత్ర భూమి మీద కుమ్మరింపబడెను. క్రూరమృగము యొక్క ముద్రగల వారికిని, దాని ప్రతిమకును నమస్కారము చేయు వారికి బాధకరమైన చెడ్డ పుండ్లు పుట్టెను. యిది నిర్గమ 9:8లో యున్న ఆరవ తెగులును పోలియున్నది. క్రైస్తవులు కాని వారికిది సంభవించెనని గుర్తుంచుకొనవలయును.

**రెండవ ఉగ్రత పాత్ర** : 16:3

యిది సముద్ర మీద కుమ్మరింపబడెను (నిర్గమ 7:17-21). ప్రకటన 8:8-9

**మూడవ ఉగ్రత పాత్ర** : 16:4-7

యిది నదులలోను జలధారలలోను కుమ్మరింపబడెను. నిర్గమ 8:10-11; ప్రక 8:3

ఆదిమ క్రైస్తవులు హింసింపబడగా వారి రక్తము నీరు వలె ప్రవహించెను. ఇప్పుడు

వారిని హింసించిన అపవాది అనుచరుల రక్తము ప్రవహించును.

వారు రక్త దాహముతో పరిశుద్ధులను హింసించిరి. దేవుడు వారిపై ప్రతీకారము తీర్చుకొనును.

**నాలుగవ ఉగ్రత పాత్ర :** 16:8-9

యిది సూర్యుని మీద కుమ్మరింపబడెను. మనుష్యులు తీవ్రమైన వేడిమితో కాలిపోయారు. వారు దుష్టులు, అపవాది సంబంధులు.

వారు మారుమనస్సు పొందలేదు సరిగదా దేవుని దూషించారు.దేవుని తీర్పును గూర్చిన హెచ్చరిక బూరలు ఊదబడినా వారు మారుమనస్సు పొందిన వారు కారు. ప్రక 8:12

**అయిదవ ఉగ్రత పాత్ర :**16:10-11

క్రూరమృగము యొక్క సింహాసనము అనగా దాని అధికార స్థావరము. వాని రాజ్యము కటిక చీకటి రాజ్యము (కీర్తన 69:23) యోహాను 3:19-20 చూడుము.

తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు చీకటినే ప్రేమిస్తారు. వారు దేవుని తీర్పుకు గురియైనను పరలోకమందున్న దేవుని దూషించిరి గాని తమ క్రియలు మాని మారుమనస్సు పొందిన వారు కారు.

**ఆరవ ఉగ్రత పాత్ర :** 16:12

యూఫ్రటీసు నది 1800 మైళ్ల పొడవు పొడవుగలది. ఇశ్రాయేలీయులకును వారి శత్రువుల మధ్యను సహజముగావున్న అడ్డు అది.

నదులు సముద్రములు ఎండిపోవుట ఆశ్చర్యముకాదు. దేవుడు ఎఱ్ఱ సముద్రమును రెండు పాయలుగా చేసినప్పుడు దానిలోనే ఐగుప్తీయులను నాశనం చేసారు.

ఘటసర్పము నోటినుండియు క్రూరమృగము నోటనుండియు అబద్ధ ప్రవక్త నోటనుండియు కప్పల వంటి ఆత్మలు బయలు వెడలెను. అవి సూచనలు చేయు నట్టి దయ్యముల ఆత్మలే (16: 13-16). అబద్ధ బోధకుల నోటనుండి వచ్చేది అబద్ధబోధయే. వారు మాట్లాడు 'అన్యభాషలు' చేయు సూచనలు బూటకములే. మత్త 7:22-24 చూడుము.

కప్ప "బహునీచమైన, బహుఅశుభ్రమైన" జంతువుగా పరిగణించబడేది. అందువలననే ఐగుప్తీయులు కప్పలచే బాధింపబడుట చాల ఘోరంగా ఎంచబడింది (నిర్గమ 8:5-11). కప్ప దుర్మార్గతకు, అపవిత్రతకు సూచన.

కప్పల వంటి మూడు ఆత్మలు ఘటసర్పము (సాతాను) నోట నుండియు క్రూరమృగము (రోమా సామ్రాజ్యము) నోటనుండియు అబద్ధ ప్రవక్త నోటనుండియు బయల్వెడలెను. అసత్యాన్ని ప్రచారం చేయడానికి సాతానుడు వివిధ ఏజెంట్లను వాడు కొనును.

క్రీస్తువారు అనుకొనని గడియలో దొంగవలె వచ్చును. ఆయన రాకకొరకు మెలకువగా యుండు వాడు ధన్యుడు.

మెలకువగా యుండి తన వస్త్రములను కాపాడు కొనువాడు ధన్యుడు . యెరూషలేము దేవాలయపు రక్షకభటుల అధిపతి రాత్రివేళ వారిని తనిఖీ చేసేవాడు.

ఆ సమయమందు నిద్రపోయే వాని వస్త్రములు ఊడదీసి వాటిని కాల్చేసే వారు. నిద్రపోవుచున్న ఆ భటుడు సిగ్గుతో దిగంబరుడుగా యింటికి పోయేవాడు.

క్రైస్తవులు కూడ క్రీస్తు రాకకొరకు ఎల్ల వేళలలో మెలకువగా యుండాలి. 1 పేతురు 5:8; మత్త 25:1-10 చదువుము.

**15-16వ వచనములలో చెప్పబడిన హార్మెగిద్దోను "యుద్ధమును" గూర్చి వచ్చే సంచికలో చూద్దాం.**

**ఏడవ ఉగ్రత పాత్ర** : 16:17-21

ఏడవ ఉగ్రత పాత్ర వాయు మండలము మీద కుమ్మరింపబడెను. సాతానుడు వాయుమండల సంబంధమైన అధిపతి అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతి (ఎఫెసీ 2:2; ప్రక 9:2).

గొప్ప స్వరము, గొప్ప భూకంపము, మహాపట్టణము, బబులోను ఇక్కడ మనకు కనబడుచున్నవి. రోమా సామ్రాజ్యము అంతర్గత దుష్టత్వము, పొరుగు దేశములు దండెత్తి వచ్చుట, ప్రాకృతిక ఉపద్రవములు మొదలగు వాటి వలన నాశనమాయెను.

**ముగింపు** : ఈ ప్రజలు తమ హృదయమును దేవుని యెడల కఠిన పరచుకొన్నందున దేవుని ఉగ్రతవారిపై కుమ్మరింపబడినది.

మనుష్యులు దేవుని తీర్పులు గమనించి మారుమనస్సు పొందకపోతే చివరకు దేవుని ఉగ్రతకు పాలవుదురు. ఇందుకు ఫరో చక్రవర్తి ఉదాహరణగా యున్నాడు. నన్ను సేవించుటకు నాజనులను పోనియ్యుమని దేవుడతనికిచెప్పగా : "ఫరో హృదయము కఠిన మాయెను గనుక అతడు వారి (మోషే అహరోనుల)

మాట వినకపోయెను" (నిర్గమ 7:13). "ఫరో ఉపశమనము కలుగుట చూచి యెహోవా సెలవిచ్చి నట్లు తన హృదయమును కఠిన పరచుకొని వారి మాట వినకపోయెను" (నిర్గమ 8:15) నిర్గమ 8:19 "........... అయితే యెహోవా చెప్పినట్టు ఫరో హృదయము కఠినమాయెను. అతడు వారి మాట వినక పోయెను". ఇప్పుడు రోమా 2:5 మరల చదువుము.

బైబిలు సర్వే - 8

# ఐక్య రాజ్యము

ఇశ్రాయేలు చరిత్రలో అతి ప్రాముఖ్యము గలది, స్వర్ణయుగముగా పరిగణించబడినది ఐక్య రాజ్యం. ఇదియే దావీదు రాజ్యం అని పిలువబడేది. ఇది క్రీస్తుపూర్వం 1075 నుండి 975 వరకు వుండి ముగ్గురు రాజుల కాలములో వెలసిల్లినది. వారు సౌలు, దావీదు, సొలోమోను. ఈ చరిత్ర సమూయేలు రెండు గ్రంధముల యందు, 1వ రాజులు మొదటి 11 అధ్యాయాలలోను మరియు దినవృత్తాంతముల యందును కలదు.

**ఇశ్రాయేలు మొదటి రాజు-సౌలు**

న్యాయాధిపతులు పరిపాలించిన 300 సంవత్సరములు ఇశ్రాయేలు 12 గోత్రీకులూ వటిష్టముగా పరిపాలించబడలేదన్న సంగతి మీకు గుర్తుకు వస్తాది. అందరిలోనూ గొప్పవాడు ఆఖరివాడు సమూయేలు ప్రవక్త. ఇశ్రాయేలు సంతానము అన్యజనుల మర్యాదననుసరించి వారికి ఒక రాజు కావలెనని కోరిరి. ఈ కోరిక దేవునికి ఇష్టమైనది కానప్పటికీ సౌలు అనే యౌవ్వనస్తుని రాజుగా నియమించుమని సమూయేలుకు ఆజ్ఞాపించెను. ఈయన ఇశ్రాయేలీయులందరికన్నా సుందరుడు అతని భుజములు యెత్తుగా వుండెను. ప్రజలందరూ మిస్పాలో కూడుకొనిన వారి రాజు వారి ముందుంచబడెను. రాజు చాలా పిరికివాడుగా వుండి సిగ్గుతో సామానుల మధ్య దాగుకొనెను.

సౌలు తన 40సం॥ పరిపాలన చక్కగా మొదలు పెట్టెను. ఇశ్రాయేలు శత్రువులచే చుట్టు ముట్టబడ్డారు వారిని

త్రిప్పికొట్టే పని సౌలు మొదలు పెట్టాడు. ఆయన సైన్యము అమ్మోరీయులను, ఫిలిష్తీయులను, మోయాబీయులను, ఎదోమీయులను యింకా మిగిలిన వారిని జయించింది.అతి తక్కువ కాలములోనే సౌలు ప్రజలందరిలో పేరు తెచ్చుకున్నాడు. కానీ ఆయన కీర్తిని చూచుకొని దేవుని ఎదుట తగ్గించు కోవడము మానేశాడు.గర్వాంధుడై పోయాడు. కనుక దేవుడు చెప్పింది చేయుటం మానేసి తన యిష్టానుసారముగా చేయటం మొదలు పెట్టాడు. ఒక సందర్భములో దేవుడు అమాలేకీయులను పూర్తిగా నాశనం చేయమని ఆజ్ఞాపించినప్పుడు సౌలు చేయకుండా రాజుని చంపలేదు. కొన్ని బలసిన గొఱ్ఱెలను, పశువులను సజీవంగా వుంచి వాటిని బలియర్పిస్తానన్నాడు. సౌలు అవిధేయతను బట్టి సమూయేలు ప్రవక్త ఆయనను గద్దించి, "బలులు అర్పించుట కంటే ఆజ్ఞను గైకొనుటయు పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటే మాట వినుటయు శ్రేష్టము అని చెప్పాడు. (1 సమూయేలు 15:22). ఆ సమయము నుండి దేవుడు సౌలును రాజుగా నిరాకరించెను.

సౌలు దేవునిచే నిరాకరించబడిన తరువాత యౌవనస్థుడు గొఱ్ఱెల కాపరి, బైబిలునందు అతి ప్రాముఖ్యమైన వ్యక్తియైన దావీదును రహస్యముగా అభిషేకించుమని నమూయేలుకు ఆజ్ఞాపించెను. అప్పటికి సౌలు యింకా రాజుగానే వుండెను. అభిషేకింపబడిన తరువాతనే దావీదు సౌలు ఆస్థానమునకు సితారా వాయించి సౌలుకు మనశ్శాంతి కలుగజేయుటకు నియమించబడెను. సౌలు దావీదును గాఢముగ ప్రేమించి తన ఆయుధములను మోయువానిగా నియమించెను. ఆజానబాహుడైన గొలియాతను ఫిలిష్తీయుని తనవడిశల రాయితో చంపుట ద్వారా దావీదు బహుకీర్తి సంపాదించెను. దావీదుకు కలిగిన కీర్తి ప్రఖ్యాతులను చూసి సౌలు దావీదు ఒక వేళ మాయోపాయముతో తన సింహాసనమును కాజేయునేమో యని అనుమానించ మొదలు పెట్టెను. నాటినుండి దావీదును, ఇశ్రాయేలు కొండలన్ని యూ వెదకి దావీదును వేటాడ మొదలుపెట్టెను.

యోనాతాను సౌలు యొక్క కుమారుడు. అతడు దావీదునకు మంచి స్నేహితుడు. బైబిలునందు వీరిద్దరి స్నేహము బహు ప్రియ మైనదియు ఉత్తమమైనదని చిత్రీకరించబడినది. తనకు బదులు రాజగునని యెరిగియూ

తన తండ్రివుగ్రత నుండి దావీదును అనేక పర్యాయములు రక్షించు చుండెను. సౌలు యోనాతానులు యుద్ధ మందు మరణించిరి. అందువలన దావీదు సింహాసనమును అధిష్టించుటకు మార్గము ఏర్పడెను.

**దావీదు - దేవుని కిష్టుడు**

సౌలు మరణానంతరం దావీదు సింహాసనాసీనుడై యూదా గోత్రమును పరిపాలించ మొదలు పెట్టెను. సౌలు కుమారుడైన ఇష్బోషెతు మిగిలిన గోత్రములను పరిపాలించుచుండెను. ఏడు సంవత్సరములకు అతని రాజ్యము కూలిపోయినది. తరువాత దావీదు ఇశ్రాయేలు మీద రాజాయెను.దావీదు యెరుషలేమును తన రాజధానిగా చేసుకొని ఇశ్రాయేలు గొప్ప రాజ్యముగా మారుటకు కృషిచేయ మొదలు పెట్టెను. దావీదు అనేక యుద్ధములందు జయము నంపాదించినైలునది మొదలుకొని యూఫ్రటీసు వరకూ తన రాజ్యమును విస్తరింపజేసెను.

దావీదు నిజముగా దేవుని కిష్టుడైనవాడు. ప్రభువు అ.కా 13:22 నందు, "మరియు ఆయన నేను యేష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని, అతడు నాయిష్టాను సారుడైన మనుష్యుడు, అతడు నావుద్దేశ్యము లన్నియూ నెరవేర్చును. దావీదు వ్రాసిన కీర్తనలను పరిశీలించిన యెడల అతనికి దేవుని యందు గల భక్తిని మనము గ్రహించగలము. ఈలాగు దేవునికి ప్రతిష్టించుకొనుట దావీదు యొక్క హృదయము దేవునికి ఆయన ఆజ్ఞను ఎంతగా విధేయత చూపుచున్నదో తేట తెల్లమగుచున్నది.దీని వలన దేవుడు తనకే ఎల్లప్పుడు విధేయత చూపిన వారి యెడల ఇష్టపడును అనునంగతి మనము నేర్చుకొనగము.

దావీదు యొక్క విజయములను దేవుని యందు ఆయనకు గల విశ్వాసమును చూపుటయే గాక తన జీవితాంతం మీదపడునట్లు గొప్ప పాపము చేసెను. అది ఏదనగా హిత్తీయుడగు ఉరీయా భార్యయైన బత్షెబాతో వ్యభిచరించుటయే. కొంత మంది బెత్షెబాయే దావీదుని మరులుగొల్పి తనవలలో వేసుకున్నదని చెప్పుదురు కానీ బైబిలునందు ఈ విషయం వ్రాయబడలేదు. ఈ పాపము కప్పిపుచ్చుటకు దావీదు ఉరియాను యుద్ధము బాగుగా జరుగుచున్న ప్రాంతమున పెట్టి చంపించెను. తర్వాత బత్షెబాను తన భార్యగా చేసుకొనెను. ఇదంతయు దేవునికి అయిష్టత

కలిగించినందున తన ప్రవక్తయైన నాతానును దావీదును గద్దించుటకు పంపించెను నాతాను గొఱ్ఱెపిల్ల కథ చెప్పుటచే కళ్ళు తెరిపించెను. 2 సమూయేలు 12వ అధ్యాయం. దావీదు మారుమనస్సు పొందెను. కానీ అసలు కష్టములు ఇప్పుడు ప్రారంభమాయెను. తన కుమారుడైన అబ్షాలోము స్వంత సోదరుని చంపెను. ఆ తర్వాత అబ్షాలోము దావీదునకు వ్యతిరేకముగా తిరుగుబాటు చేసి యుద్ధములో మరణించెను. ఈ సంధర్భముననే దావీదు అరణ్యమునకు పారిపోయి తలదాచుకొనెను. ఈ దుఃఖము నుండి కోరుకొనక మునుపే "ఎడోనిజ" అను ఇంకొక అదోనీయం కుమారుడు దావీదునకు విశ్వాసపాత్రుడైన యూజాబు అను సైన్యాధిపతి సహాయంతో రాజ్యమును ఆక్రమించుకొన ప్రయత్నించెను. దీనిని ఆరికట్టుటకు దావీదు సొలోమోను అను తన ఇంకొక కుమారుని రాజుగా పట్టాభిషిక్తుని గావించెను. తర్వాత కొద్దికాలముననే గొప్ప దైవజనుడైన రాజైన దావీదు తన 40 సం॥ల పరిపాలన ముగించి చనిపోయెను.

**సొలోమోను – జ్ఞానమునుండి విగ్రహారాధనకు**

సొలోమోను యొక్క పరిపాలన తన తండ్రి పరిపాలనకు వ్యతిరేకమైనది. దావీదు తన జీవిత కాలమంతయు రాజ్యమును స్థిరపరచుటకు బహు ప్రయాసపడగా సొలోమోను మాత్రము నిశ్చలమైన ప్రారంభమే బహుశుభకరమైనది. దర్శనమందు దేవుడు సొలోమోనుకేమి కావలయునో కోరుకొనుమనిన ఇతడు ధనముకంటే జ్ఞానము కావలయునని దేవుని నడిగెను. అందుకు దేవుడు ఎంతగానో సంతసించి జ్ఞానము, కీర్తి, ధనము అనుగ్రహించెను. ఈ భక్తుడు 3000 సామెతలను, 1005 పాటలను వ్రాసెను. ఇతని యొక్క జ్ఞానము చదునబోవు మూడు పుస్తకములలో పొందుపరచబడియున్నది. ఇతడు తనయొక్క జ్ఞానమును బట్టి రాజకీయముగా ఇశ్రాయేలును ప్రపంచములో అతి శక్తివంతమైన రాజ్యముగా తయారుచేసెను. సొలోమోనుకు కలిగిన విస్తారమైన ధనరాసులు ఈరోజున మనలను కూడ ఆశ్చర్యపరచు చున్నవి. ఆయనకు 1400 రధములు, 12000 మంది గుఱ్ఱపు రౌతులు కలిగి సం॥నకు 240 లక్షలు రూ॥ల ఆదాయము వచ్చుచుండెడిది. ఒక సారి షీబ దేశపు రాణి ఆయనను చూడవచ్చి 35 లక్షల రూ॥లు కానుకగా

ఇచ్చెను. ఆయనను ఆమె దర్శించినపుడు ఈ విధముగా చెప్పెను. 1 రాజులు 10:6,7 నీ కార్యములను గూర్చియు, జ్ఞానమును గూర్చియు నా దేశమునందు నేను వినిన మాట నిజమే. అయినను నేను వచ్చి కన్నులార చూడకమునుపే ఆ మాటలను నమ్మక యుంటివి. ఉన్నదానిలో నగమైనను నాతో చెప్పబడలేదని ఇప్పుడు నేను తెలిసికొనుచున్నాను. నీ జ్ఞానమును, నీ భాగ్యమును నేను వినిన దానిని బహుగా మించియున్నది.

సొలోమోను చేసిన కార్యములని[illegible]లోను అత్యున్నతమైన కార్యము [illegible]వా దేవుని ఆరాధించుటకు దేవాలయమును నిర్మించుట. ప్రజలు ప్రత్యక్ష గుడారమందు దేవునిని అరణ్యములో పితరులున్నప్పటి నుండి ఆరాధించుచు వచ్చిరి. దానిని తీసి ఈ ఆలయమును సొలోమోను కట్టించెను. బహుషా ప్రపంచములో మరి ఏఇతర కట్టడము ఇంత ఖరీదైె నది కట్టబడి యుండలేదు. 1 లక్ష 83 వేల మంది కార్మికులు 7 1/2 సంవత్సరములు శ్రమించి 60 బిలియను రూ॥లు వ్యయ పరచి కట్టిరి. తనకు గల విస్తారమైన ధనమును బట్టి క్రమేపీ అతడు దేవుని విడిచిపెట్టెను. ప్రపంచములో ఉన్న ప్రతీ దానిని ఆనందించెను. 700 మంది భార్యలను వివాహమాడి 300 మంది ఉంపుడు గత్తెలను కలిగి యుండెను. వీరిలో చాలామంది విగ్రహారాధికులు కనుక వారిని సంతోష పరచుటకు సొలోమోను ఎంత కష్టపడియుండెనో ఆలోచించండి. తన అధికమైన భోగవిలాస జీవిత ఖర్చుల కొరకు ప్రజలపై అధిక పన్నుల భారము వేసెను. ఇది ప్రజలను బహుగా అసంతృప్తి పరచెను. అతని యొక్క ఏలుబడి జ్ఞానము, ధనములతో మొదలుపెట్టి అంతమునకు స్త్రీలను, విగ్రహారాధనతోను ముగిసెను. తన 40 సం॥ల పరిపాలన అంతమగు సరికి అతడు క్షీణించి చాలా అశాంతితో నిండిపోయెను. తన విలాస జీవితము ద్వారా తన మరణానంతరము రాజ్యము విడిపోవుటకు పునాదులు వేసెను. ఈ విభజన గురించి తరువాత పాఠములో చదువుకొందుము.

# పరిణామ సిద్ధాంతము ఆదికాండము
## ( Evolution versus Genesis Accont)

పరిణామ సిద్ధాంతమును, బైబిలును కూడ నమ్మేవారున్నారు. అందువలన "దైవిక పరిణామము" (Theistic Evolution) అనే సిద్ధాంతమును సృష్టించారు. అంటే ఈ లోకాన్ని దేవుడు సృజించాడు గాని దాన్ని పరిణామ క్రమంలో సృజించాడని వారి నమ్మకము. గాని ఆదికాండము చెప్పుదానికి ఈ క్రొత్త సిద్ధాంతమునకును పొసగని స్వవిరుద్ధ సంగతులు అనేకములున్నాయి. దిగువ కొన్ని చెప్పబడ్డాయి.

1. సూర్యుడు సృజింపబడకమునుపే వృక్షములు సృజింపడెనని ఆదికాండము చెప్పుచున్నది (ఆది.కా. 1:11-14) గాని పరిణామ సిద్ధాంతమయితే మొదటి వృక్షము దర్శనమివ్వక లక్షలాది సంవత్సరములకు ముందునుండే సూర్యుడున్నాడని చెప్పుచున్నది.

2. సృష్టిక్రమములో పక్షులు ఐదవ దినమున సృజింపబడెనని ఆదికాండము చెప్పుచున్నది. మరియు నేలను ప్రాకు పురుగులు, జంతువులు ఆరవ దినమందు సృజింపబడెను (ఆది.కా. 1:21-24) గాని పురుగులు, జంతువులు ఉద్భవించిన తరువాత చాల కాలమునకు పక్షులు కలిగెనని పరిణామము చెప్పుచున్నది.

3. దేవుడు మానవుని నేలమంటితో సృజించెనని బైబిలు చెప్పుచున్నది. (ఆది కా. 2:7; 3.19; 1కొరి 15:45). పరిణామమయితే మానవుడు కోతిజాతి నుండి ఉద్భవించెనని చెప్పుచున్నది.

4. మత్స్యములకు ముందు ఫల వృక్షములు చేయబడెనని ఆదికాండము చెప్పుచున్నది (ఆది 1:11). అయితే పరిణామ సిద్ధాంత ప్రకారము ఫలవృక్షములకు ముందే మత్స్యములుద్భవించెనని చెప్పబడుచున్నది.

5. సార్వజనిక జలప్రళయమును గూర్చి ఆదికాండము చెప్పుచున్నది (ఆది.కా. 7:10-12; 17-20). అయితే అట్టి జలప్రళయం ఎన్నడు కలుగలేదని పరిణామము చెప్పుచున్నది.

ఈ విషయాల్లో మానవుడు చెప్పే సిద్ధాంతములకనా దేవుడు తన గ్రంథమందు చెప్పినది నేను విశ్వసిస్తాను. బైబిలు పక్షమున మనముంటే ఎన్నడు ఏ పొరబాటుచేయం, పొరబాటులో యుండము!

- మేక్స్ పీటర్సన్

# ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్

## Asian Bible Lectureship at Kakinada

**తేదీలు** : 2008 నవంబరు 30వ తేదీ నుండి
డిశంబరు 4వ తేదీ వరకు

**సమయం** : ప్రతిరోజు ఉదయం 10:00 గంటలకు
మధ్యాహ్నం 3:00 గంటలకు
సాయంత్రం 6:00 గంటలకు

**స్థలం** : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
విద్యుత్ నగర్
**కాకినాడ**

ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో ఆసియాలోని పలుదేశాలలో సువార్త చాటుచున్న గొప్ప బోధకులు, స్వదేశీ బోధకులు ఉపన్యసించెదరు, బైబిలులోని ప్రాముఖ్యాంశములను తెలిసికొనుటకు మీకు ఇదే మంచి తరుణము. ఆ సభలో పాల్గొనుటకు మీరు మీ సంఘము ఇప్పటి నుండే సిద్ధపడండి.

Cell : 92474-56270
0884-2363722

**వందనములతో**
**రిక్కి గూటంగారు**
**జాషువా గూటంగారు**

# సంక్షిప్త వార్తలు

2008, మార్చి 11వ తేదీ మంగళవారం కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో క్రీస్తుసంఘ సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఆ సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతములనుండి సువార్తికులు తరలివచ్చిరి. సోదరులు రిక్కీగూటంగారు అధ్యక్షత వహించి సదస్సును చక్కగా నిర్వహించిరి. ఆ సదస్సులో అమెరికా నుండి వచ్చిన సోదరులు జెర్రీ బేట్స్‌గారు, మరియు రోజర్ రైట్‌గార్లు వాక్య పరిచర్య చేసి సోదరులను ఆత్మీయముగా బలపరచరి. సోదరులు ఆర్.సి.ఎహ్. సద్గుణరావ్‌గారు ఆంగ్ల ప్రసంగములను తెలుగునకనువదించిరి. అదే రోజు మధ్యాహ్నకాల మందు సోదరి పాలా బేట్స్‌గారు హాజరైన స్త్రీలకు ప్రత్యేక బైబిలు తరగతి నిర్వహించిరి.

2008 మార్చి 14వ శుక్రవారం మధ్యాహ్నం 2:17 గంటలకు రిక్కీగూటం, సుదీపగూటం దంపతులకు దేవుడు ఒక చక్కని కుమారుని అనుగ్రహించారు. తల్లి బిడ్డలు క్షేమముగానే యున్నారని తెలియజేయుటకు సంతోషించుచున్నాము.

నవంబరు – డిశంబరు నెలలలో జరుగబోవు ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ యొక్క స్థలము మార్చబడినది. చదువరులు గమనించ ప్రార్థన.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU

P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by [illegible] Satya Vani Publication, [illegible] Kakinada - [illegible]